

గురుకుల విద్యార్థులకు..

దుప్పలవలస గురుకుల విద్యార్థులు అనారోగ్యం బారిన పడ్డారు. డీఎంహెచ్‌ఓ పరిశీలించారు.

- 8లో



పేద కుటుంబాలపై కక్ష

పారశిల్లి, చోడవరంలో పేదలపై కక్ష సాధింపు జరుగుతోంది. దీన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు.

- 8లో

రాజీనామా తిరస్కరణ

ఎచ్చెర్ల క్యాంపస్: రాజకీయ ఒత్తిళ్లు కారణంగా పూడివలస గ్రామ సచివాలయ కార్యదర్శి సనపల సీతారాం బుధవారం రాజీనామా చేసిన విషయం విదితమే. ఎంపీడీఓ, డీపీఓలకు రాజీనామా లేఖ అందజేయగా వారు తిరస్కరించారు. ఫార్మేట్ సక్రమంగా లేక పోవటం, కేవలం వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో ప్రస్తావించడం వల్ల తిరస్కరించినట్లు సమాచారం.

న్యూస్‌రీల్

అరసవల్లిలో ఘనంగా మహాలింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నిర్వహించారు. భక్తులు ఈ లింగార్చనలో పాల్గొని అనంతరం ఆదిత్యుడిని దర్శించుకున్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



హెచ్‌ఎంకు ఆదేశాలు ఇస్తున్న డీడీ అన్నదొర

కొత్తూరు: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఆదేశించారు. కొత్తూరు మండలం లబ్బ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. వంట గదులు, వాటర్ ప్లాంట్, తరగతి గదులను పరిశీలించారు. వాటర్ ప్లాంట్ ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. విద్యార్థులకు వైద్యాధికారులతో ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని చెప్పారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఐటీడీఏ డిప్యూటీ డీఈఓ నారాయుడు, ఏఎంఓ పొట్నూరు కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీవో రాములమ్మ ఉన్నారు.

ఫ్రింజ్ పరిశ్రమలో స్వల్ప ప్రమాదం

రణస్థలం: మండలంలోని పిసిని పంచాయతీలో గల ఫ్రింజ్ ల్యాబొరేటరీ రసాయనిక పరిశ్రమలో స్వల్ప ప్రమాదం చోటు చేసుకుందని జేఆర్ పురం పోలీసులు తెలిపారు. పరిశ్రమలో కొంతమంది కార్మికులు పనిచేస్తుండగా గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ట్రీని క్లోరైడ్ రసాయనిక డ్రమ్ ఒత్తిడికి గురై డ్రమ్ మూత తెరుచుకుంది. రసాయన వాయువులు బయటకు రావడంతో ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న పొట్నూరు త్రినాథరావు, కొలగాన గోవిందరావు కళ్లు ఎర్రగా మారాయి. త్రినాథరావుకు పైడిభీమవరంలో ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపించారు. గోవిందరావుకు తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల విజయనగరంలోని ప్రముఖ కంటి వైద్యులకు చూపించి చికిత్స అందించారు. ఇరువురి పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జేఆర్ పురం సీఐ జి.రామచంద్ర రావు పరిశీలించారు.



కుటుంబ సభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జిల్లా నూతన కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కి బదిలీ అయింది. ఆయన స్థానంలో స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబ సమేతంగా రాగా.. అరసవల్లి దేవస్థానం వేదపండితులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేశారు. కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, కలెక్టరేట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదిత్యుడిని దర్శించుకున్న కలెక్టర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జిల్లా నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సతీ సమేతంగా గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కలెక్టర్ గోత్రనామాలతో అర్చకులు పూజలు జరిపించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. తర్వాత ఆలయ విశిష్టతను కలెక్టర్‌కు శంకరశర్మ వివరించారు.

ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తుల సౌకర్యాల విషయంలో చేయాల్సిన పనుల వివరాలు, ఇంద్రపుష్కరిణి అభివృద్ధి తదితర పనులను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఆలయ అధికారులు బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




కొత్త కలెక్టర్ దినకర్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ప్రధాన అర్చకులు శంకరశర్మ

అందని దీవెన విద్యార్థుల హైరానా!



- అందని వసతి, విద్యాదీవెన ఫీజులు
- ధ్రువపత్రాల జారీలో మెలిక పెడుతున్న యాజమాన్యాలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- రెండు పథకాలు కలిపి రూ.83.02 కోట్ల బకాయిలు
- స్పందించని కూటమి ప్రభుత్వం



విద్యాదీవెన రూ.35.17 కోట్లు..

జిల్లాలో విద్యా దీవెన పథకం కింద రూ.35.17 కోట్లను 50,945 మంది విద్యార్థులకు అందజేయాల్సి ఉంది. వీరిలో ఎస్సీలు 3964 మంది, ఎస్టీ లు 1335 మంది, బీసీలు 43,179 మంది, ఈబీసీలు 1539 మంది, ముస్లింలు 158 మంది, కాపులు 747 మంది, క్రిస్టియన్లు 23 మంది ఉన్నారు.

వసతి దీవెన రూ.47.85 కోట్లు..

జిల్లాలో వసతి దీవెన పథకం కింద 50895 మందికి రూ.47.85 కోట్ల మేర ప్రయోజనం కలగాల్సి ఉంది. వీరిలో ఎస్సీలు 3755 మంది, ఎస్టీలు 770 మంది, బీసీలు 43797 మంది, ఈబీసీలు 1696 మంది, ముస్లింలు 158 మంది, కాపులు 700 మంది, క్రిస్టియన్లు 19 మంది ఉన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్:

సెమిస్టర్ పరీక్షలు పూర్తి చేసుకుని రిలీవ్ అవుతున్న కాలేజీ విద్యార్థులకు ధ్రువపత్రాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. డిగ్రీ, పీజీ, డిప్లమా, ఐటీఐ, ఇంజినీరింగ్, మెడికల్ తదితర ఉన్నత కోర్సులు చదువుతున్న విద్యార్థులకు చెల్లించాల్సిన విద్యా దీవెన, వసతి దీవెనపై కొత్త సర్కారు నుంచి స్పందన లేకపోవడం, బకాయి ఫీజులు చెల్లిస్తేనే టీసీ తదితర ధ్రువపత్రాలు అందిస్తామని కొన్ని కళాశాలల యాజమాన్యాలు మెలిక పెడుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం ఏటా మూడు నెలల (త్రైమాసికం) ఒకసారి జగనన్న విద్యా దీవెన చెల్లించగా, ఆరు నెలలకు ఒకసారి జగనన్న వసతి దీవెన చెల్లించేది. షెడ్యూల్ ప్రకారం జూన్ రెండో వారంలో విద్యార్థులకు అందజేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అలాగే ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ప్రతి విద్యా సంవత్సరం జూన్ లో, ఆ తర్వాత ఏప్రిల్లో రెండు వాయిదాల్లో జగనన్న వసతి దీవెన అందించేవారు. ఈ పథకంపైనా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు.

ఇదీ పరిస్థితి..

విద్యాదీవెన కింద ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర విద్యార్థులకు రూ.20 వేల చొప్పున చెల్లించేవారు. ఈ క్రమంలో 2023 అక్టోబర్, 2024 మార్చి ఒకటో తేదీన విద్యార్థులు తల్లుల ఉమ్మడి ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఇప్పుడు జనవరి–ఏప్రిల్ మాసాలకు చెల్లించాల్సిన నిధులపై ఎలాంటి స్పందన లేదు. అయితే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా, ప్రభుత్వం ఫీజులను ఇప్పటి వరకు విడుదల చేయలేదు. దీంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇకపై విద్యార్థులు కట్టే ఫీజులను నేరుగా కళాశాలల ఖాతాల్లోనే జమ చేస్తామని కొత్త ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ముగిసిన విద్యా సంవత్సరం ఫీజులపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఫీజు రీయింబర్స్‌మెంటే ఆధారం..

ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సుల్లో 83 శాతం మంది విద్యార్థులు విద్యా దీవెన కింద ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకుంటూ చదువుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వం కాలేజీ విద్యకు ఫీజు ఎంత ఉన్నా అందులో రూ.35 వేలు మాత్రమే చెల్లించేది. ఇక వసతి దీవెన మాటే లేదు. ఫీజుల కోసం నాడు విద్యార్థుల తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు అమ్ముకునే పరిస్థితి ఉండేది. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అర్హత గల ప్రతి విద్యార్థికీ ఫీజు ఎంత ఉన్నా నూరు శాతం రీయింబర్స్‌మెంట్ చెల్లించారు. జవాబుదారీతనం పెంచేలా, పారదర్శకంగా తల్లి, విద్యార్థి ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో త్రైమాసికానికోసారి విద్యా దీవెన జమ చేసేవారు. ఎలాంటి వివక్ష చూపకుండా చెప్పిన సమయానికి నిధులు జమ చేసేవారు.

మళ్లీ ఇబ్బందులు తప్పవా..

గతంలో అంటే 2014–19 సంవత్సరాల్లో సక్రమంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. ఫీజుల కోసం యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచేవి. పరీక్షలకు హాల్ టికెట్లు, పాసైతే సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టేవి. ఫలితంగా చాలా కుటుంబాలు అప్పులు చేసి పిల్లల ఫీజులు చెల్లించారు. కళాశాలల ఫీజు కంటే తక్కువ ఫీజు రీయింబర్స్ చేయడంతో పేద విద్యార్థుల కుటుంబాలపై మోయలేని ఆర్థిక భారం పడేది. మిగిలిన డబ్బును విద్యార్థులే చెల్లించాల్సి పరిస్థితి ఉండేది.

అప్పట్లో చాలా చోట్ల విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళనలు కూడా నిర్వహించారు. ప్రస్తుత సర్కారు తీరు చూస్తుంటే మళ్లీ అదే పరిస్థితి వస్తుందేమోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

బకాయిలు విడుదల చేయాలి



ఇంజినీరింగ్ ఆరో సెమిస్టర్ రిలీవ్ అయ్యాను. ఫలితాలు వచ్చాయి. టీసీ, ఓడీ, ఇతర సర్టిఫికెట్లు తీసుకోవాలంటే ఫీజు చెల్లించమంటున్నారు. తల్లి ఖాతాలో వసతి దీవెన, విద్యా దీవెన నిధులు పడతాయని, కళాశాల నుంచి ధ్రువీకరణ పత్రాలతో రిలీవ్ అయ్యాక మళ్లీ వచ్చి ఫీజు చెల్లిస్తావన్న నమ్మకం ఏంటని కాలేజీ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేసి సమస్య పరిష్కరించాలి.

– సోహన్ కుమార్, ఈసీఈ ఇంజినీరింగ్, చివరి సెమిస్టర్, బీఆర్‌ఏయూ

ఇబ్బంది లేకుండా చూడాలి



ప్రస్తుతం చివరి సెమిస్టర్ విద్యార్థులు ఉన్నత విద్యకు, ఉద్యోగాల్లో చేరేందుకు ధ్రువీకరణ పత్రాలు అవసరం. ఇంజినీరింగ్‌లో ఫీజు స్ట్రక్చర్ ఎక్కువ. ఈ నేపథ్యంలో ముందస్తు చెల్లింపుల భారం లేకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. ఖాతాలో పడిన వెంటనే ఫీజులు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటాం. సకాలంలో ఫీజులు విడుదల చేయక పోతే చివరి సెమిస్టర్ విద్యార్థులు ఇబ్బంది పడతారు.

– భాగ్యలక్ష్మి, సీఎస్ఈ ఇంజినీరింగ్, చివరి సెమిస్టర్, బీఆర్‌ఏయూ

సకాలంలో అందజేయాలి



గత ప్రభుత్వంలో నిరుపేద విద్యార్థులకు అందజేసిన విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు ఎంతో మందికి ఆసరాగా నిలిచాయి. కొత్త ప్రభుత్వంలో ఆ పథకాలు కొనసాగించి నిరుపేద విద్యార్థులకు సకాలంలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను అందజేయాలి. ఫీజులు చెల్లింపుల విషయంలో కళాశాలల నుంచి ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా చూడాలి. ప్రస్తుతం ఉన్న బకాయిలను వెంటనే చెల్లించే విధంగా తక్షణమే ప్రభుత్వం దృష్టి సారించాలి.

– డి.ఉమామహేశ్వరరావు, బీటెక్ విద్యార్థి, టెక్కలి

స్పష్టత ఇవ్వాలి..



నిరుపేద విద్యార్థులకు అనుకూలమైన విద్యా దీవెన, వసతి దీవెన పథకాలపై సరైన ఆలోచన చేసి స్పష్టత ఇవ్వాలి. ఇటువంటి పథకాలు నిరుపేద విద్యార్థులకు ఎంతో వరం. విద్యా దీవెన, వసతి దీవెన పథకాల వల్లే ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేశారు. తక్షణమే నిధులు విడుదల చేసి కళాశాలల నుంచి ఎటువంటి హెచ్చరికలు లేకుండా చూడాలి.

–కె.హరిప్రసాద్, బీటెక్ విద్యార్థి, టెక్కలి

'మిరాజ్' సినిమా క్లైమాక్స్ చిత్రీకరణ



సన్నివేశం చిత్రీకరణలో చిత్ర యూనిట్

వజ్రపుకొత్తూరు రూరల్: కేఎంసీ ఫిల్మ్ మేకర్స్ బ్యానర్‌పై విష్ణుదేవ్ దర్శకత్వంలో కె.సత్యభాస్కర్ నిర్మాతగా తెరకెక్కుతున్న మిరాజ్ సినిమాలో క్లైమాక్స్ సన్నివేశాలు గురువారం ఉద్దానం తీర ప్రాంతంలో చిత్రీకరించారు. చరణ్, దీపిక హీరో హీరోయిన్లుగా ప్రధాన విలన్‌గా డాక్టర్ కుమార్ నాయక్, రమేష్ యాదవ్ నటిస్తున్న ఈ చిత్రాన్ని జిల్లాలోనే తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చారు.

ఆదిత్యుని సన్నిధిలో సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు



ఆదిత్యుని సన్నిధిలో సంపూర్ణేష్ బాబు

అరసవల్లి: త్వరలో విడుదల కానున్న 'సోదరా..' సినిమాలో కొత్త సంపూర్ణేష్‌బాబును చూస్తారని, ఇప్పటివరకు చేసిన పాత్రల కంటే విభిన్నమైన పాత్ర పోషిస్తున్నట్లుగా ప్రముఖ నటుడు సంపూర్ణేష్ బాబు అన్నారు. ఆయన గురువారం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ, సిబ్బంది బీఎస్ చక్రవర్తిలు ఆయనకు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం సంపూర్ణేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ తన కొత్త సినిమాను గార మండలం లంకపేట శివాలయం వద్ద ప్రారంభించిన సందర్భంగా జిల్లాకు వచ్చామని, జిల్లాలో పలు ప్రాంతాల్లో షూటింగ్‌ను చేయనున్నట్లుగా వివరించారు. అలాగే తమిళంలో ఒక సినిమా చేస్తున్నానని, సరికొత్త పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తానని ప్రకటించారు. అనంతరం స్వర్ణకారుల సంఘ ప్రతినిధులు ఎం.విజయ్, ఫైట్‌మాస్టర్ జానీ తదితరులు హీరో సంపూర్ణేష్‌బాబును ఘనంగా సత్కరించారు.

ఆ అగ్ని పేరు అల్లూరి



స్వాతంత్య్ర వీరుడా.. స్వరాజ్య పాలుడా అంటూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వీరగాథను జిల్లా జ్ఞప్తికి తెచ్చుకుంది. గుండె గుండెనా స్వాతంత్య్ర కాంక్షను రగిలించిన అగ్ని పేరు అల్లూరి అని స్మరించుకుంది. అల్లూరి జయంతి సందర్భంగా ఊరూవాడా ఆ మహావీరుడికి నివాళులర్పించాయి. సారవకోటలో ఆదివాసీ సంఘ నాయకులు ఇలా అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పించారు. – సారవకోట

జిల్లాలో ఏడు డీసీసీబీ బ్రాంచీలు ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: జిల్లాలోని ప్రతి మండలంలో ఒక డీసీసీబీ బ్యాంకు ఉండాలన్న ఉద్దేశంతో ఈ ఆర్థిక సంవత్సరం నాటికి అదనంగా మరో ఏడు బ్రాంచీలను ప్రారంభిస్తున్నామని డీసీసీబీ జీఎం ఎస్‌వీఎస్ జగదీష్ అన్నారు. ఆయన గురువారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, డీసీసీబీ బ్యాంకుల్లో కంప్యూటరైజేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కంచిలి, నందిగాం, సంతబొమ్మాళి, పోలాకి, చిలకపాలెం, పూండి, కొల్లివలస గ్రామాల్లో బ్రాంచీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ రుణాలు రెన్యువల్ చేస్తున్నామని, ఖరీఫ్, రబీ సీజన్‌లలో వంద కోట్లు బిజినెస్‌కు టార్గెట్ చేయడం జరిగిందని, ప్రస్తుతం రూ.50కోట్లకు దగ్గరలో ఉన్నామన్నారు. జిల్లాలో 49 పీఏసీఎస్‌ల్లో కంప్యూటరైజేషన్ 50 శాతం పూర్తయ్యిందని, త్వరలో మిగతా 50 శాతం పూర్తి చేయనున్న నేపథ్యంలో ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు చేయడం జరుగుతుందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలకు వంద కోట్లు వరకు రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి తమ బ్యాంకుల ద్వారా సుమారు రూ.50వేల వరకు రుణాలు అందజేస్తున్నామని తెలిపారు.

అర్బన్ ఏరియాలో నిబంధనలకు లోబడి రూ.75లక్షల వరకు ఇళ్ల నిర్మాణాలపై రుణాలు అందిస్తున్నామని అన్నారు. సమీక్ష సమావేశంలో డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ డొంకాన కృష్ణారావు, పీఏసీఎస్ సీఈఓ భుజంగరావు, అసిస్టెంట్ మేనేజర్ మోహన్ పురియాలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రావులవలస వాసికి ఏడాది జైలు శిక్ష

నరసన్నపేట: మండలంలోని రావులవలసకు చెందిన తాళ్ల రాంబాబుకు ఏడాది జైలు శిక్షను విధిస్తూ స్థానిక సివిల్ జడ్జి సి.హరిప్రియ గురువారం తీర్పునిచ్చారు. 2019 జూన్ 4న నరసన్నపేట మండలం గుండవల్లిపేటకు చెందిన తాళ్ల కుమారి తన భర్త రాంబాబు అత్తమామలు రాములమ్మ, పెంటయ్య, ఆడపడుచు లక్ష్మీ సౌందర్యలపై ఫిర్యాదు చేశారు. కేసును విచారించిన జడ్జి గురువారం ఈ మేరకు తీర్పు చెప్పారు. రాంబాబు మినహా మిగిలిన ఆయన కుటుంబ సభ్యులు నిర్దోషులుగా గుర్తించి వారికి ఎలాంటి శిక్ష విధించలేదు. అప్పట్లో నరసన్నపేట ఎస్ఐగా ఉన్న ఎస్ఐ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేశారు. కోర్టులో ఏపీపీగా శాంతి సంతోషి వ్యవహరించారు.

క్లుప్తంగా

నిందితుడికి రిమాండ్

పొందూరు: మండలంలోని బొడ్డేపల్లి గ్రామానికి చెందిన వివాహితను హత్య చేసిన ఎ.గోపాలరావును బుధవారం సాయంత్రం అంపోలు జైలుకు రిమాండ్‌కు తరలించామని సీఐ దివాకర్‌యాదవ్ తెలిపారు. గోపాలరావును పొందూరు కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. అక్కడ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించామన్నారు.

12 మంది తొలగింపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న 12 మంది విశ్రాంత ఉద్యోగులను తొలగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత తెలిపారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి మార్గదర్శకాలను అనుగుణంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

గంటన్నర పాటు నిలిచిన వందే భారత్ రైలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలు సుమారుగా గంటన్నర సమయం నిలిచిపోయింది. ఇచ్ఛాపురం నుంచి జాడుపూడి వైపు వెళ్లే గూడ్స్ రైలు సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోవడంతో వందే భారత్‌ను ఆపాల్సి వచ్చిందని రైల్వేస్టేషన్ అధికారులు తెలిపారు. ఆలస్యం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు.

దుప్పలవలస గురుకులం విద్యార్థులకు
ఆరోగ్య సమస్యలు

- ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసిన డీఎంహెచ్ఓ మీనాక్షి

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చాలా మంది పిల్లలు వారం రోజులుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నారు. ఇప్పటికే గత వారం రోజుల్లో జితేంద్ర, కార్తీక్, కె.కార్తీక్ అనే ఇంటర్మీడియెట్ విద్యార్థులకు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో అపెండిసైటిస్ శస్త్రచికిత్సలు నిర్వహించారు. ప్రస్తుతం వీరు కోలుకుంటున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఈ కడుపు నొప్పి సమస్య ఎదుర్కోవటంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి గురువారం పాఠశాలను పరిశీలించారు. మెస్, కిచెన్, తాగునీరు పరిశీలించారు. మెస్‌లో పారిశుద్ధ్యం పాటించాలని, విద్యార్థులు నీరు ఎక్కువగా తాగాలని సూచించారు. పాఠశాల డిస్పెన్సరీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి సమస్య ఉన్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.శేషగిరి, వైద్యురాలు పి.సౌమ్య, ఈఓ జగన్నాథరావు ఆధ్వర్యంలోని బృందం వైద్య సేవలు అందిస్తోంది. కడుపు నొప్పి ఎక్కువగా ఉన్న విద్యార్థులను రిమ్స్‌కు స్కానింగ్ పంపిస్తున్నారు. అవసరం మేరకు వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందజేస్తున్నారు.


కడుపు నొప్పితో బాధపడుతున్న విద్యార్థులు


మెస్ పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి


విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌమ్య

ఫాస్ట్‌ఫుడ్ వల్లనేనా..?

మరో పక్క విద్యార్థులు కుశాలపురం బైపాస్ ప్రాంతానికి సాయంత్రం వెళ్లి ఫాస్టు ఫుడ్‌లు, నూడుల్స్ వంటివి తినటం వల్ల ఎసిడిటీ వస్తోందని పాఠశాల సిబ్బంది అంటున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవటం వల్ల విద్యార్థులు బయటకు వెళ్లకుండా నియంత్రించడం సాధ్యం కావటం లేదని చెబుతున్నారు. మెస్‌లో సైతం ఆహార పదార్థాలు, వంటపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎంహెచ్ఓ సూచించారు. త్వరలోనే సమస్య అదుపులోకి వస్తుందని వైద్యులు తెలిపారు. వైద్యుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగుతున్నట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తెలిపారు.

శ్రీకాకుళం ఓ మధుర జ్ఞాపకం

- బదిలీపై వెళ్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్
- ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా అధికారులు


సన్మాన సభలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లాలో పనిచేయడం తన కెరీర్‌లో ఒక మధుర జ్ఞాపకంగా ఉంటుందని బదిలీపై వెళ్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఒక్కసారి అయినా జిల్లా ఎన్నికల అధికారిగా పనిచేసి సమర్థంగా, ప్రశాంతంగా నిర్వహించాలనే కల ఇక్కడ నెరవేరడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన చెప్పారు. బదిలీపై వెళ్లిపోతున్న ఆయనకు జిల్లా అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో గురువారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమష్టి కృషితో ఎన్నికలు సమర్థంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాకు ఒక సీనియర్ మంత్రి ఒక మంచి శాఖకు ఉండడం భవిష్యత్‌లో జిల్లాకు మరింత మంచి జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో మీరు చూపిన అంకితభావం సమర్థవంతమైన విధి నిర్వహణ వెనుక అందరి కుటుంబ సభ్యులు ఉన్నారని, వారికి ఈ ఘనత దక్కుతుందన్నారు. జేసీ నవీన్ మాట్లాడుతూ కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ నిరాడంబరతకు మారుపేరని అన్నారు. ఆయన దగ్గర చాలా ముఖ్య అంశాలు తెలుసుకున్నామని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు మాట్లాడుతూ పని పూర్తి స్థాయిలో నేర్చుకోవడానికి వీరి దగ్గర పనిచేయడం చాలా అవసరం అని అన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నవ్వుతూ ఎంత పనైనా సమర్థంగా నిర్వహించి, పనిలో అందరికీ సలహాలు సూచనలు అందజేయడమే కాకుండా ఎన్నికల నిర్వహణలో ప్రతి క్షణం చేపడుతున్న పనులపై ఆరా తీస్తూ వెంటనే స్పందించి సూచనలు అందజేసే వారిని కొనియాడారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత ప్రభుత్వం న్యాయ వ్యవస్థలో కీలకమైన మూడు చట్టాలను ప్రవేశపెట్టిందని, దీనిపై న్యాయవాదులకు పూర్తి అవగాహన ఉండాలని బీసీ న్యాయవాదులు సంఘం జిల్లా అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు తెలిపారు. జూనియర్ న్యాయవాదులకు గురువారం కొత్త బార్‌లో కొత్త చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసుల నమోదులో చాలా మార్పులు వచ్చాయని, శిక్షలు మరింత కఠినంగా ఉంటాయని ఆయన వివరించారు.

కొత్త చట్టాలు భారతీయ నాగరిక సురక్షా సహిత, భారతీయ న్యాయ సహిత, భారతీయ సాక్షి బిల్‌లు అమలులోకి వచ్చాయని తెలిపారు. వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పేద కుటుంబాలపై కక్ష

- పారశిల్లిలో ఆక్రమణల పేరుతో పశువుల రేక్ షెడ్ తొలగింపు
- చోడవరంలో కూడా దళితుడి ఇంటి వెనుక భాగం తొలగింపు
- అధికారుల చర్యలను ఖండించిన మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్


పారశిల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మేడి కృష్ణారావు రేకు షెడ్‌ను తొలగిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మండలంలోని పారశిల్లి గ్రామంలో 107/1లో సర్వే నంబర్‌లో ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మేడి కృష్ణారావు పశువుల రేక్ షెడ్‌ను రెవెన్యూ యంత్రాంగం పోలీసు బందోబస్తుతో వచ్చి తొలగించింది. గడిచిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా మేడి కృష్ణారావు పనిచేశారనే అక్కసుతో అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే రమణమూర్తిలకు చెప్పి కక్షతో కావాలని గురువారం తొలగించారు. ఇదే సర్వే నంబర్‌లో ఎల్.ఎరుకవాడు, కింతాడ అప్పన్న, పి.గోవిందరావు, బి.కృష్ణమూర్తి తదితరులు ఆక్రమణలకు పాల్పడి నిర్మాణాలు చేసినా వాటిని తొలగించకుండా కావాలని మేడి కృష్ణారావుపై కక్షతో ఆయన వేసిన రేక్ షెడ్‌ను జేసీబీతో తొలగించారు. ఈ చర్యను స్థానికులు తీవ్రంగా ఖండించారు. ఆక్రమణలకు పాల్పడితే అందరికీ ఒకేలా చర్యలు ఉండాలి గానీ అధికార పక్ష కార్యకర్తలకు ఒకలా ఎదుట పార్టీ కార్యకర్తలకు మరోలా చర్యలు తీసుకోవడాన్ని స్థానికులు నిరసించారు.

చోడవరంలో..

అలాగే చోడవరంలో ఎస్సీ వర్గానికి చెందిన బోనెల కృష్ణ భార్య రాము పేరు జగనన్న కాలనీలో స్థలం గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ స్థలంలో ఆయన ఇళ్లు నిర్మాణం చేసుకున్నారు. ఇంటి వెనుక కొంత ప్రభుత్వ స్థలం ఖాళీ ఉండగా అందులో బాత్‌రూమ్ నిర్మించారు. దీన్ని జీర్ణించుకోలేని ఆ గ్రామ టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేయించి బాత్‌రూమ్‌ను గురువారం తొలగించారు.


చోడవరంలో బోనెల కృష్ణ ఇంటి వెనుక బాగాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఖండించిన ధర్మాన కృష్ణదాస్..



టీడీపీ శ్రేణుల ప్రోద్బలంతో అధికారులు ఆక్రమణలు పేరిట పేదలకు చెందిన ఆస్తులను నష్ట పెట్టడం శోచనీయమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు సహేతుకం కాదని అన్నారు. ఆక్రమణలు ఉంటే అందరినీ ఒకేలా చూడాలని, అందరివీ తొలగించాలని కోరారు.

కక్ష కట్టారు..



నేను గడిచిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పనిచేయడాన్ని జీర్ణించుకోలేని వారు నాపై కక్ష కట్టి ఆక్రమణ పేరుతో రేక్ షెడ్‌ను తొలగించారు. ఇది దారుణం. ఎన్నో ఏళ్లుగా ఈ స్థలం నా అనుభవంలో ఉంది. ఇదే ప్రాంగణంలో మిగిలిన ఆక్రమణలు ఉన్నా పట్టించుకోలేదు. ఇది మరీ దారుణం.

– మేడి కృష్ణారావు, పారశిల్లి

ఇంటి వెనుక నిర్మాణం తొలగించారు



నాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. సొంత డబ్బుతో ఉన్నంతలో ఇల్లు కట్టుకున్నాను. ఇంటి వెనుక కట్టుకున్న బాత్‌రూమ్‌ను కక్ష కట్టి తొలగించారు. ఇది టీడీపీ నాయకుల పనే.

– బోనెల కృష్ణ, చోడవరం


పెద్దలక్ష్మీపురంలో గ్రామస్తులు హతమార్చిన వైరాగు నాగు

16 అడుగుల వైరాగు నాగు హతం

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామంలో 16 అడుగుల వైరాగు నాగు పామును గ్రామస్తులు మతమార్చారు. గురువారం సాయంత్రం కొంతమంది రైతులు గ్రామానికి సమీపంలో ఉన్న ఎర్రచెరువు గట్టుపై పశువులు మేపుతుండగా ఏట శబ్దాలు వినపడటంతో వెతికారు. కానీ ఏమీ కనిపించలేదు. కొంతసేపటికి అదే గ్రామానికి చెందిన బైపోతు భీమారావు, అప్పారావులు పామును చూశారు. దీంతో అంతా భయపడ్డారు. అనంతరం చేపలు పట్టే వలతో పామును చుట్టేసి హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

'లక్ష్యాలను నెరవేర్చాలి'

ఎచ్చెర్ల: ఉపాధ్యాయులు శిక్షణ శిబిరాల్లో ఇచ్చిన లక్ష్యాలను నెరవేర్చాలని ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్‌జేడీ) విజయ భాస్కర్ తెలిపారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం, ఆమదాలవలస మండలాల్లోని 150 మంది ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్‌టూల్ శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో విలియం, కోర్సు డైరెక్టర్ కారు పున్నయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బైక్ ప్రమాదంలో లారీ కింద పడి ఉన్న మృతదేహం, బైక్

కంచిలి: మండలంలోని పెద్ద కొజ్జిరియా గ్రామ కూడలి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలవ్వగా, మరో వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఒడిశా ఛత్రపూర్ బ్లాక్ నంద కొండపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బెంగళూరులో వివిధ చోట్ల పనిచేస్తున్న ముగ్గురు యువకులతో కలిసి గురువారం వేకువ జామున 3 గంటలకు రెండు ద్విచక్ర వాహనాల్లో బయల్దేరారు. వీరు మధ్యాహ్నం కంచిలి మండలం పెద్దకొజ్జిరియా గ్రామం వద్దకు వచ్చే సరికి ఒక ద్విచక్రవాహనం అతివేగంతో వెళ్లి అదే దిశలో రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న దిలీప్ కుమార్ పారిడా(24) అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక సీటులో కూర్చొన్న హరిబాబు పారిడా తీవ్ర గాయాలపాయాల్యాడు. తీవ్రగాయాలపాలైన హరిబాబు పారిడా బెంగుళూరులో స్విగ్గీ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. హరిబాబు పారిడాను మరో బైక్‌లో వస్తున్న స్నేహితుడు దిబ్ కళ్యాణ్ సోంపేట సీహెచ్‌సీలో చేర్పించాడు. బాధితుడు హరిబాబు పారిడా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.